ఫణి

కవిరాజు

కొండవీటి వేంకటకవి

సహకారమునకు

కృతజ్ఞతలతో

14-11-60

ఆత్మలో విషమ్ము నంగిటిలో బెల్లమనెడు నుడియె మున్ను వినఁగఁబడియెఁ
గంఠవిషము వెడలఁ గ్రక్కి లోకము లేర్చు వెట్టి పనికిఁ జొరకు విశ్వనాథ.

— కవిరాజు

(శ్రీ

కవిరాజు

కొండవీటి వేంకటకవి

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి

అక్టోబరు
1960

వెల
రూపాయ

కృతి

పలుకుం దొయ్యలి తారహారములు కావ్యశ్రీలు తద్భావనా
బలసంపత్తికి మూలకందములు విద్వాంసుల్ తదభ్యర్చనా
కలితుల్ పాములపాటి వంశజులు తత్కవ్రాన్వయ శ్రీ సము
జ్జ్వలమై నీవలనం గడించినది శబ్దబ్రహ్మ సామ్రాజ్యమున్.

౨

ననొక్కన మిత్రుఁగాఁగ గణనమ్మొనరింపుఁడు పెద్దఁజేసి మా
కున్నతిఁ గూర్చి బాధ నిడకుండుఁడటంచు వచించు సూక్తిలో
విన్నను వెంతయో కొలతవెట్టితి ముగ్ధుఁడనైతి బాంధవ
మ్మన్నెఱిఁగించి మామపదముం గయిసేసితి మిన్ను ముట్టితిన్.

3

విద్యలెఱింగి చేసినది వీసములే దొకకొంత చేసినన్
హృద్యము గాదు హృద్యమగునే ననవద్యముగా డెబ్బైనన
య్యుద్యమ రూపరేఖలకు నూపిరివోయఁ గడంగినాఁడవీ
విద్యకు విద్యనేర్పిడి వివేకము భాగ్యము లభ్యమయ్యెఁగా.

౪

నీసరి లేరటంచు గమనించి సదా వివిధాంధ్ర సంస్థల
గ్రాసనమిచ్చి కొల్చెనిను నందనిగౌరవ మాఁచికోని వి
శ్వాసము లేదు నేఁటికిఁ బ్రజాపరిషత్తులఁ జిత్తవృత్తులం
దాసముదంచిత ప్రతిభ కాఘటితిస్మరణమ్మ సొమ్మగున్.

x

త్యాగము భోగమిప్పుడొక త్రాసునఁ దూఁచు శిబిప్రభుండవై
ప్రాగనుభూతు లర్థికరపల్లవ రేఖల సంఘటించి తీ
త్యాగమహస్సు లన్వహము దన్పిన వాంఛ్రుల నార్థికాగమ
శ్రీగరిమమ్మునందు నినుఁజెప్పి మఱొక్కనిఁ జెప్పఁగా వలెన్.

౬

దొరముస్తీదున కప్పళించి కనులేదో జుట్టినట్లుండు నీ
సరసోక్తిన్ వికసించి వీనులు సుధాసారమ్మునం దోఁగు నీ
కరుణాదృష్టికిఁ గాన్కయై హృదయ ముత్కంఠాప్తి నూఁగాడు నీ
స్మర దాకారమునన్ గరంగి సకలమ్మున్ మోహ విభ్రాంతమౌ.

౭

తన మనోనిర్ణయమ్మునకు వీసమేమ్మని
జవదాటనట్టి దీక్షాతపస్వి
తన హృదబ్జమున నిల్చిన సాధుశీలుని
మనసార సేవించు మానధనుఁడు
తన నమ్మినట్టి సిద్ధాంతమ్ము విటతాట
నమ్మగానీని ధైర్యమ్మితావు
తన కల్మి కపవాద మణుమాత్ర మేనాఁడు
దరిఁ జేరనీని సుస్థిరయశుండు
నిరవధిక సత్యసౌశీల్యనియమ శమము
లానుపూర్వ్యసమాలబ్ధమయ్యె దానఁ
జిరయశయుపార్జనము జన్మసిద్ధమయ్యె
వరుల కల్పద్రుమపుఁ గొమ్మ నాయఁడమ్మ.

ర

పసిఁడి హొరంగులం జిలుము ఫాలముతో నరుణాంశు రేఖలున్
ముసిరిన విస్తృతమ్ముగు కనుంగవతో నుదయైననాసతో
ముసిముసి నవ్వుతో మురిపముల్ దొలఁకాడెడు దంతపంక్తితో
నొసపరి రూపు బాపురె యహోయనిపించు సమంచితస్థితిన్.

ఱ

దరహసితాంకురమ్ములు సదా ప్రతిపత్తివచఃపరంపరల్
పరపెడు వేళలన్ సుకవిపండితకోటి హృదంతరమ్ములన్
గిటికొనుచుండు మెండు గిలిగింతలు సంతసమంది మిత్రత
న్నెరపెడు వేళలన్ దొలఁగు నీవను నేనను దారతమ్యముల్.

నిండార విరిసిన బొండుమల్లెలచేవ
బొమ్మిడీకము వింత పొలుపొసంగ
సొగసైన పసిఁడి కచ్చంబోని నొసటిపై
నిడువాలుబొట్టు వన్నియను గూర్ప
రాచఠీవికి వన్నెరా నిట్ట మెలివెట్టు
నులిమిసకట్టు పెందళుకులీన
ఆఁదోఁక పాటుగా నమరు పిక్కలనంటి
నిలువుటంగీ హొయల్ చిలుకుచుండ
నిండుకొలువుండు శ్రీ యంకినీఁడు జేఁడు
భోగదేవేంద్రుఁ డార్జిత పుణ్యధనుఁడు
రత్నమాంబాధిపుఁడు పుత్ర రత్నమనుచు
నామతించిన సుకృతివయ్యా ! కృతీంద్ర !

౧౧

పలుకుంబల్లికుఁ దేనెసోనలను గూర్పంజాలు మాంచాల నీ
కులకాంతా హృదయమ్మ నాఁచికొనెఁ బెక్కుల్ గాథ లింకేల ని
స్తులదాంపత్యము మోది మోవలె రసజ్ఞుల్ కావ్యకన్యామణీ
కలగానమ్మును విన్న విన్ననువు నౌఁగా సాహితీపోషకా!

౧౨

అలంబించిన వీరభారతకథాధ్యక్షత్వముం గాంచి మాం
చాలస్వామిని వైననీకు గురుశిష్యత్వమ్ము సంబంధమున్
బాలింపన్ మనుపన్ సగర్భ్యుఁడగు సుబ్బారావు తోపాటునే
నేలా! తమ్ముఁడఁగాక పోవుదును సాహిత్యానుసంబంధినై.

౧౩

చిరతరకీర్తి నార్జనము చేసిన యంకపనాయఁ డన్నమల్
మురిసిన ముద్దుపంట కవిముఖ్యుల పాలిటి మెట్టపంట నా
వరసుత కాత్మవల్లభుని వల్లభునిం బొనరించి తమ్ము న
న్నరయు పురంధ్రి కయ్యెడు మనామయ మర్థమనంత సౌఖ్యముల్

౧౪

నాకృతికన్య యన్యుల కనారతకీర్తి నొసంగు సుప్రతి
ష్ఠాకమనీయమూ ర్తి కిడఁ జాలునెకీర్తి పతి ప్రతిష్ఠకై
కూఁకటివేరుతో విబుధకోటి కభీప్సిత మిచ్చు కల్పకా
నోకహ మాదిఁబెంచి తిది నూత్నము వేంకటసుబ్బమాంబికా.

౧౩

కవితాకన్యలు నల్లుకైదుగురు భాగస్వామ్యముంగోరి నీ
ధవు నంకస్థితినాని రాత్మ చరితార్థత్వమ్మునుం గాంచి రీ
సవతాంద్రున్ బతిపాదపద్మ భజనాసంసక్త చిత్తాబ్జవై
మివులన్ గౌరవ మాచరింతు వదియేమీ! ధర్మసంజీవికా!

౧౪

గౌరవ మిచ్చి పుచ్చుకొనఁగాఁ దగుపట్టుల నాల్మగల్ మిమున్
గూరిచి తీయతీయని మనోహరగాథల నల్లికొందురీ
తీరుల నెల్లవేళ యువతీయువకుల్ తలఁదాల్తురిట్టి సం
సార సుఖానుభూతి కభిమానము చూపుదు రాదరమ్మునన్.

౧౫

ధనము గడించి పెంచి యదిదాఁచి జగద్ధితబుద్ధిగా వ్యయ
మ్మొనరుపఁ జాలినట్టి సుగుణోదధు లెందఱుగల్గరీ జగ
మ్మున నిటుచేయ దీనికనుమోదము ముద్దియ లెవ్వరిత్తు రీ
ఘనతకు మూదలైరి మునుగా మన పాములపాటి దంపతుల్.

౧౬

ఎంతటి గుండె నిబ్బరము లీరు వహించితిరో సమగ్రపుం
బుంతలఁ బట్టభద్రుల కపూర్వము గాఁగఁ గళానికేతన
మ్మింతగఁ బల్లెటూర వెలయించితి రాత్మలయందు దీనినే
సంతతిగాఁ దలంచితిరి సంచిత విత్త సమర్పణమ్మునన్.

OF

మీగుణగానమునన్ మా
ర్మోగున్ దిగూహ్యహములు సముజ్జ్వలభాషా
సాగరవేలా పరివృత
భూగోళకశాప్రవృద్ధ పురుషార్థములై.

౨౦

కావున మత్కృతీశ్వరునిగా మెఱయించితి బుచ్చినాయఁడా
తావకకీర్తికాంతకిది తావళమై పటుదర్ప ధాటికిన్
దావలమై శుభాకృతికి దర్పణమై గుణరత్న దీప్తికిన్
శేవధియై రసాకృతిఁ బ్రసిద్ధి వహించుత మంత్రిమండలిన్.

—కర్త

★

3

X30

మతము కులము మధ్య మాఁడిన జనమును
సేదఁదేర్చి చీకుచింత లుడిపి
దేశమునకు దివ్యదీప్తుల నొసఁగిన
బుద్ధు పాదపద్మముల భజింతు.

౨

ఆత్మదోషములకు నారాటపడువారు
విగ్రహములఁగొల్చి వెఱ్ఱులైన
మొఱుకు నమ్మకముల మొదలంట దులిపిన
రామమోహనుని గరంబు గొలుతు.

3

వేద పఠనమునకు వెలివేసి కొందఱఁ
దమకుఁదామె పెత్తనములు గొన్న
స్వార్థపరులగుట్టుఁ జాటించి చెప్పిన
కందుకూరి సుకవి గారవింతు.

ప్రాఁతచదువులోని బండాలమూల నెల్ల
వెలికిఁదీసి కసుల విప్పఁజేసి
క్రొత్తపథముఁ జూపు నుత్తమ విజ్ఞాని
రామసామి సుకవిరాజుఁ బలఁతు.

౫

నిత్య సత్యములను నిర్మూలన మొనర్చి
మతము పేర మత్తుమందు చల్లి
సంఘజీవనమును సమయింపఁజేసిన
కుమతులకును దెల్విఁ గూర్పు బుద్ధ.

౬

చెట్టు పుట్టలెల్ల సేవించి తాదాత్మ్య
మంది బుద్ధిజాడ్య మంకురింపఁ
గార్య కారణములఁ గన్గొన నేరని
పేదలైరి వేదవిదులు బుద్ధ.

౭

జీవహింస నెవుడు సేయక నియతిని
మమతఁ బెనుచు నట్టి మనుజులెల్ల
వేదబాహ్యులనుచు వెక్కిరింతు రిదేమి
కర్మమయ్య మోసగాండ్రు బుద్ధ.

౮

ఒక్క కులములోని యొక్కువ తక్కువల్
మచ్చరములఁ బెంచి మంచి నణఁచె
నొకరినొకరు గలియకుండు నున్మాదమ్ము
పెచ్చు పెరిఁగి ముప్పు దెచ్చె బుద్ధ.

౯

కులము మతమటంచు గొణఁగుచు నుందురు
వర్ణధర్మములను వదలుచుండ్రు
దారిగాని దారి తారాడుచుందురు
మేలుగలుగఁ గొందఱోలె బుద్ధ.

౧౦

పరులమ్రోల నీతిపాఠముల్ వల్లించు
మొగమునిండ బూది పూయుఁ గాని
కానిడబ్బుకొఱకుఁ గడలేని యన్యాయమ్ము
నాడు మోడుపడనివాఁడు బుద్ధ.

౧౧

ఉత్తమునకు సాయమొసరింప నది వేయి
మడుఁగు లగుచు ఫలము లిడుచునుండుఁ
గష్టచరితునకును గావించు సాహాయ్య
మత్స్యమగుచు వెంటనంటు బుద్ధ.

౧౨

కుక్కతోఁక వంక గోసినఁ దీఱును
గొయ్యివంక పొయ్యిఁ గూరఁ దీఱు
భేదబుద్ధివాని పెడత్రోవఁ దీర్పఁగాఁ
గాష్ఠమునకుఁ జేతగాదు బుద్ధ.

౧౩

హీనగుణుఁడు పరుల హీనులఁగా నెంచి
వదరుచుండు నగ్రవర్ణ మనుచు
జాతిమతముపేర సాపాటు సాగించు
వారు దీని విడువలేరు బుద్ధ.

౧౪

భానువంశ గౌరవమ్మ్మ వమ్మ్మగు నట్లు
సీతపుట్టి లంకఁ జిచ్చువెట్టె
శంకరుండు పుట్టి సాంకర్య మొనరించె
మానవత్వమెల్ల మాఁడ్చి బుద్ధ.

౧౫

పరుల మంచికెపుడు మెరమెరవోయెడు
కోపగుణము తన్నుఁ గూల్చు నెన్న
శంకరుండు శిల్ప సామ్రాజ్యముం జేల్చి
చీల్పఁబడఁడె శిష్యచేత బుద్ధ.

౧౬

సత్యధర్మములను సమయింప నెవఁడోవుఁ
గాలగతికి లొంగుఁగాక యెరకట
ధర్మచక్ర మగ్రతాంబూల మందదా
నేఁడు రాచపదవి నిల్చి బుద్ధ.

౧౭

కడుపునిండఁ దిండి గానని పేదకు
నీతిబోధ మివుల రోఁతఁగూర్చు
భుక్తి ముక్తియందు మున్మొందుగా భుక్తి
మానవుండు గోరఁబూను బుద్ధ.

౧౮

ఎగ్గులగ్గులేని కిగ్గాడి మూఁకల
పాలనమున భూమి పాడువడును
గింకవీంద్ర కంఠహుంకారమున జన
మ్మితలకుతల మగుచు నడఁగు బుద్ధ.

౧౯

కలిమిలేము లెన్నఁ గావడికుండలు
సమముగా భరింప సౌఖ్యమబ్బు
దయకు ధర్మమునకుఁ దబ్బిబ్బుగానీక
మెలఁగుచున్న మేలుగలుగు బుద్ధ.

౨౦

దర్శనములఁ జదివి తాత్పర్య మెఱుఁగక
మతమతాంతరముల మనసు నిల్ప
సమతచదిసి నీతిసమయును దానిచే
ధర్మమునకు దెబ్బతగులు బుద్ధ.

౨౧

ధనము గల్గియుంట దశయందుఁ గాని
కూడు నిదుర దాన వీడవలయుఁ
బ్రోవుచేయ దాఁపఁబోవ దుఃఖముగల్గుఁ
గలిమి గష్టమునకుఁ గాదె బుద్ధ.

౨౨

పడిన శవముఁ బట్టి భక్షించు రాబందు
గూబ కాకి గ్రద్ద కుక్క నక్క
ప్రాణమున్నవానిఁ బట్టి భక్షించును
శ్రమ మొనర్పలేని జనుఁడు బుద్ధ.

౨౩

సర్వజీవులకును జైతన్య మొకఁడంచు
నన్నమయము తనువులంచుఁ బలికి
నేను నీవటంచు నిమ్మోహన్నతమ్మ్నల
నిలిపిరేల సంఘములను బుద్ధ.

౨౪

కడుపు నాయఁగట్టి కష్టించి కాల్నేత
ధనము గూడవెట్టి తాను దినక
బెదరు బొమ్మరీతి నదలించుఁ బిసినారి
పజ్జఁజేరు నెల్లవారి బుద్ధ.

౨౫

బోయవెలఁది గర్భమునఁబుట్టె వాల్మీకి
పల్లెతకును గల్గె వ్యాసమూని
తల్లిమొదల శూద్రధర్మిణి తానెట్లు
చెప్పికొనఁగవచ్చు గొప్ప బుద్ధ.

౨౬

పరుల మెప్పుకొఱకు బాహ్యపూజ యొనర్చి
వేషభాషలకును విలువ నిచ్చి
మెచ్చుకోలు నంద మిణుకుచు నుండెడి
పాపి గనునె ముక్తిపథము బుద్ధ.

౨౭

ఒళ్లు గుల్లఁజేసి యిల్లాలి నేడ్పించి
యిరుగుపొరుగువారి ముఱికటించి
యఱుత మాలఁజేర్చి తిరుచూర్ణముం దీర్చి
రామ యనిన ముక్తిరాదు బుద్ధ.

౨౮

పాపమన్నఁ బరుల బాధించి బ్రమకుట
పున్నెమన్నఁ బరుల భుక్తికిడుట
కాగడాలు వెట్టి గాలించినం గాని
యింతకంటెఁ గర్జమేమి బుద్ధ.

29

దినము తద్దినమ్మ్మె పనిగల్గు పట్టుల
మెడకు నూలుబద్దె తొడిగి దాని
నుప్పు(బవ్వు ముట్ట నూ(డ(దీయు నదేమి
పాపమనక మంత్రవాది బుద్ధ.

30

మంత్రతంత్రములను 'మమ' యనుకొనుమని
దైవభాష(జదువ(దగదటంద్రు
పొత్తరలకు లొంగి పూర్వాపరమ్మ్మెల
నెఱు(గరైరి కొంద ఱిలను బుద్ధ.

31

కలియుగాన ధర్మములు నిల్వవను సుద్ది
మునులు దొల్లి గ్రంథముల వచింప(
గుమతులెల్ల నేడు గుమిగూడి వంకల
దిద్ద(జూతు రేమి తెలివి బుద్ధ.

32

వేగిలేచి పరుల వెన్నాడి తిమ్మిని
బమ్మిగా(గ బమ్మితిమ్మిగా(గ
మచ్చరించి పల్కు- మచ్చనాల్క-లవారు
బాగుపడ(గనీరు ప్రజల బుద్ధ.

33

నేల నీరు నిప్పు గాలి యాకసమును
గలసిమెలసి భూతగణము గలిగెఁ
బట్టుఁదప్పి కుండ బ్రద్దలయ్యెడు రీతి
సారముడిగి జీవి సమయు బుద్ధ.

34

లంచమిచ్చి తగిన మంచాల నందఁగాఁ
గాంక్షసేసి హవ్యకవ్యములను
దేవతలకు నిచ్చి దేవురింతు రిదేమి
సోమిదమ్మ లింట సుక్క బుద్ధ.

35

కుక్క గౌరియంచుఁ గోరి పూజించును
గోఁతి యనుమఁడంచుఁ గొల్చుచుండు
సాటిమానవుండు సరసను నిల్వఁగా
మండిపడును దుర్జనుండు బుద్ధ.

36

వంశమెంత పరమపావనం బైనను
దల్లిదండ్రు లెంత ధన్యులైనఁ
గొఱివివంటి పుత్రకుఁడు గల్గు నొకసారి
నీటఁ బుట్టుఁగాదె నిప్పు బుద్ధ.

౩౭

మంచివార లెంత మన్నించి తమలోనఁ
గలుపుకొన్న బోధ సలిపియున్న
దుష్టబుద్ధిగుణము దొలఁగింప నేరురా
చేఁపనూనె కంపు చెడునె బుద్ధ.

౩౮

సొమ్మ్ము కాంత యనెడు సుడిగాలిలోఁ బడి
గడ్డిపోఁచయట్లు గదలు ఖలుఁడు
ధీరుఁ డాత్మయందు నీరెంటి నంటక
కొండఁబోలి కదలకుండు బుద్ధ.

౩౯

చింపిరాలు ప్రోవుచేసిన ఫలమేమి
జాతిరత్న మొకఁడు చాలదేమి
తులువ లెందఱున్న ఫలమేమి యుత్తముఁ
డొక్కరుండు చాలకున్నె బుద్ధ.

౪౦

మంచి చెడ్డలకును మారాడ నోరాడ
కున్నవాని లోక మెన్న దెవుడు
సత్యమునకు ఱొమ్మ్మిచఱచి నిల్చినవాని
మించి జగము సన్నుతించు బుద్ధ.

౪౧

అందలమ్మ్మా లెక్కీ యూచిత్య మెఱుఁగక
పెల్లుమీఱి తిరుగు లొల్లెకాండ్రు
నీతిబోధ సలుప నేల నాల్గుచెఱంగు
లల్లుకొనిరి మంచి డుల్లె బుద్ధ.

౪౨

నిజముకల్ల కల్లనిజముగాఁ జేసెడి
కూళఁ గన్నతల్లి గోడుగుడుచుఁ
జదువుకొన్న సుతుల సరణి యిట్లైనచో
భరతమాత యెట్లు బ్రదుకు బుద్ధ.

౪౩

పరమతమ్మ్మా లురలఁబడువేళ సివమెత్తి
సాశ్రుపరుషవచన మిశ్రితుండగు
మతము జాతి నిల్ప సతమతమ్మా నేఁడు
వంచకుండు పరుల వంచి బుద్ధ.

౪౪

తలలు బోడిసేయఁ దలపులు బిఱుసెక్కీ
మొట్టితొట్టి వాక్యముల నెఱింగి
పాదపూజఁగోరి ప్రతి పట్టణములోనఁ
దానె యగును గావితాల్పు బుద్ధ.

౪౫

నామరహితుఁబిల్వ నాలు కెట్లూడునో
పురము లేక యంతిపురము గలదె
రూపరహితుఁ జూడఁ బాప కెట్లుందునో
కడుపులేక కాన్పుగలదె బుద్ధ.

౪౬

వాక్కువలన మనసువలనఁ బట్టఁగరాని
వానిఁగూర్చి వాదుఁబూనుటెల్ల
గొడ్డురాలిబిడ్డ బొడ్డుగోసినయట్లు
నవ్వులాట మాటలివ్వి బుద్ధ.

౪౭

చేత మాలదిరుగుఁ జిత్తమ్మునం గోరు
ల్లిబిల్లిదిరిగి యాశలంటుఁ
బ్రజలు భక్తుఁడనుచు భ్రమియింప వేదాంతి
బోధసేయు సభలఁబూని బుద్ధ.

౪౮

బాలకుండు గురుఁడు బాపండు వృద్ధుండు
వలఁతి యలఁతికొలమువార లైన
ధర్మమునకు హానిఁ దలపెట్టుచో వారి
దండనమ్మ సేయఁదగును బుద్ధ.

౪౯

శుకము గారణముగ శుక యోగి జన్మించె
శ్వానమునకుఁ బుట్టె శౌనకుండు
జంతువులకుఁ బుట్టు సన్న్యాసులే వంశ
కర్తలైరి తెల్వి గాలె బుద్ధ.

౫౦

కృతయుగాన వేదమతము గన్పట్టదు
త్రేతఁగల్గె నొక్క ప్రాఁతచదువు
ద్వాపరాంతమందు వ్యాసుండు గల్పించె
వేదములను నాల్గువిధుల బుద్ధ.

౫౧

మూఁడు జాతులైన మూఁడు వేదమ్ములు
నాల్గు జాతులైన నాల్గువేద
ములును గల్గెఁ బంచములు గల్గ నైదవ
వేద మొకటి నాఁడు వెలసె బుద్ధ.

౫౨

వీలువాలుతేని వెంగలిమూఁకలు
తలకు మొలకు ధర్మముల రచింప
డెక్కుముదిరి కులముతిక్క పైకెకెఁగా
మానవత్వమెల్ల మాసె బుద్ధ.

౫౩

బడుగుగతికిఁ గంటఁ దడివెట్టఁగా లేని
కర్కశత్వమందె గ్రంథచయము
దయకు ధర్మమునకుఁ దావీయఁగా లేని
వాఙ్మయమ్మ్మ నేఁడు ప్రబలె బుద్ధ.

౫౪

పరుల యాపదలకుఁ బరితాపమందుచు
సజ్జనుండు మివుల సాయపడును
గాంక్షచేసికడుపుఁ గైలాసముగఁ గూళ
కాలమానములను గడపు బుద్ధ.

౫౫

బోడితలలు సేసి బూడిద పూసిన
మోక్షమునకుఁ జేరఁబోఁడు జడుఁడు
తలఁపు లన్ని యుడిగి ధర్మమ్మ్మ నెదనిల్పి
మెలఁగువాఁడె శాంతివలచు బుద్ధ.

౫౬

ఆలుబిడ్డలెల్ల గోలగాఁ దోఁచిన
సన్న్యసించు జగము చక్కఁబఱుపఁ
నుట్టికేకలేని పొట్టి స్వర్గమునకు
నెక్కఁ జూచినట్లు లెన్న బుద్ధ.

౫౭

సన్న్యసించి మోక్షసామ్రాజ్యముం గోరు
జోగికేల సర్వభోగములును
గాయగసముఁ దినుచుఁ గానలోఁ దిరుగాడఁ
బూనఁడేమి యాసమాని బుద్ధ.

౫౮

ఏది ధర్మమనుచు మూఢలించునో దాని
నడచుకొనిన మేలు వడయుఁ బుడమిఁ
బలుకునేఁత లొక్కపాళమ్ముగా నున్న
జగముఁ జెల్లఁ బూజ సలుపు బుద్ధ.

౫౯

ఓసి యనుచు నాలిఁ గూసి యాసడముతోఁ
గావ్యమల్లు లాఁతికాంతఁ గోరి
పెరటిచెట్టు దనకుఁ గొఱగాని యట్టుల
నెంచుచుండు మూర్ఖుఁ డెపుడు బుద్ధ.

౬౦

తల్లి దైవమంచుఁ గల్లలు వల్లించి
యింట బైటఁ దల్లి కెల్లగతుల
స్వేచ్ఛలేని నీచజీవితమ్మ్మును గూర్చి
తనియుచుండు మూఢజనుఁడు బుద్ధ.

౬౧

వేదశిఖలయందు విద్యాస్వరూపిణి
వాణియంచు ఋషులు వ్రాసిపెట్టి
యాఁడజాతి చదువఁగూడదు చదివిన
నరకమంచుఁ దెలిపినారు బుద్ధ.

౬౨

తల్లి గౌరవమ్ము దలఁపక యుంటచే
భరతభూమి యిన్నిపాట్లు వడియెఁ
దల్లి కెసరువెట్టు తనయుల కగచాట్లు
దప్పవయ్యె నేటిదాఁక బుద్ధ.

౬౩

మంచి చెడ్డలందు మరియాద విడనాడి
మేళతాళములను మేళవించి
దైవమనుచు సత్యధర్మకంటకులయి
మెలఁగుచుంద్రు గొంద ఱిలను బుద్ధ.

౬౪

మేలుగీళ్ల కెల్ల మూలమ్మ్ము దైవమ్మ్ము
నేను బాపి ననెడు నీచుఁ డెవుడు
సంఘమునకు సత్యసన్నిధానమునకు
ననదయగుచు భారమగును బుద్ధ.

౬౫

నోసటిక్రాలు దుడువఁ బస లేదటన్నచో
మంచిచెడ్డ లింక నెంచనేల
పాపపుణ్యములను బాటించి సరిదిద్దఁ
బూనువాఁడు పాపియౌనె బుద్ధ.

౬౬

అద్దమందు బింబమరసి చక్కనదిద్దు
జ్ఞానిరీతిఁ బరులఁగాంచు బుధుఁడు
బింబమరసి పొడుచు పిచ్చుకవలెఁ గూళ
పరుల నెవుడు గొంచెపఱుచు బుద్ధ.

౬౭

మాటలాడలేని మనుజుండు మూనియై
పలుకకున్న గౌరవమ్మ్మొ గల్గు
చాడిచెప్పి బ్రదుకు సన్న్యాసి మృతుఁడైనఁ
బ్రజలకెల్ల మేలు ప్రబలు బుద్ధ.

౬౮

తనకుఁదానె బురదఁ దారాడు బాలుండు
నొక్కచోటఁ దాను జిక్కరీతి
మాయకల్పనముల మది నమ్మ్మొకొనువాఁడు
ఘోరయాతనలను గుందు బుద్ధ.

౬౯

బుద్ధునకును ధర్మమునకు సంఘమునకు
శరణుచొచ్చువారు చతురమతులు
నయము భక్తి నిట్లు నాగార్జునాచార్యుఁ
డేరుపఱిచె ముక్తిఁగోరి బుద్ధ.

౭౦

ప్రభవ మునికి వృద్ధి పరిణామ ముడుగుట
మరణమనెడి యీఱుమార్గములును!
దనువుఁదాల్చు జీవికిని దప్ప వెప్పుడు
పూర్ణతత్వ మిదియ పుడమి బుద్ధ.

౭౧

జీవ మున్నదనుక శీలమ్ము పాటించి
మెలఁగ సంఘమునకు మేలు గలుగుఁ
దప్పుపనులుసేసి దైవమ్ము దలఁచెడు
వారుగలుగ సంఘమీఱు బుద్ధ.

౭౨

కర్మధర్మములను గల్పనమ్మొనరించు
కొన్న మనుజుఁడంద కూలిపోవుఁ
బొట్టలోని దారమట్టిట్టు పెనవేయఁ
బట్టుపురువు రీతి గిట్టు బుద్ధ.

౭౩

మానసమ్మునందు మలఁచిన రూపమ్ము
ప్రీతిగూర్చు నొకట భీతిగూర్చు
దైవరూపములను దయ్యాల రూపాల
మానవుండు గాదె మలఁచె బుద్ధ.

౭౪

ఔషధమ్ముమాట నానోట నానోట
నాలకింప రోగ మడఁగఁగలదె
చెవియు నాల్క రెంటిచేఁగాక మానిసి
యాత్మవలన శాంతి నందు బుద్ధ.

౭౫

జాతికల్పనమ్ము జన్మసంవాదమ్ము
బుద్ధిబలమువలనఁ బుట్టినవియ
హేతువాదమునకు నిసుమంత నిలువక
వీఁగిపోవుఁ దుక్కఁ రేఁగి బుద్ధ.

౭౬

కలనుగనిన వస్తువులు మేలుకాంచిన
మాయమైన రీతి మమతచెడిన
నాది నీది యనెడు భావరబందియే
తొలఁగిపోయి సుఖము నిలుచు బుద్ధ.

౭౭

బండి చక్రమట్లు పరువెత్తఁ గాలమ్ము
నిలువలేవు ధర్మములు సతమ్ము
నాఁడు ధర్మమైన నేఁడధర్మమ్మయి
కాలగతిని మాఱుఁగాదె బుద్ధ.

౭౮

నమ్మకమ్ములేని త్రిమ్మరి మాటుల
నాససేసి నడువ మోసమగును
గుక్కనెత్తి బోన మెక్కడనిల్చును
నడుమఁ గదప నేలఁ బడక బుద్ధ.

౭౯

నాది యనిన గోతిలో దూఁకఁ జపలమ్ము
నీది యనినఁ గల్లు నిశ్చయమ్ము
నాది నీదియంచు వాదాడు వాచాటుఁ
డాయువెల్లఁ దీతి యాఱు బుద్ధ.

౮౦

బెట్టిదమ్ము వీడి వినయమ్ముతోఁ గూడి
మంచివారితోడి మైత్రి గల్గి
కోవిదుండు మెలఁగుఁ గుమ్మరి పురువట్టు
లింటిబురద నంటనీక బుద్ధ.

౮౧

చాటుమాటు దిట్టి సన్నిధానమునందుఁ
బొగడువారు పుట్టపగిలినారు
మనసులోనిమాట వినుపించువారలు
కొఱతవడిన గొప్ప చెఱుపు బుద్ధ.

౮౨

తమకుఁ దామె నమ్మకము లేనివారలు
ప్రబల దేశగౌరవమ్ము చెడును
లేనిపోని యూహ లానాఁటి కానాఁటి
కెదిగిపోవ గుండె చెదరు బుద్ధ.

౮౩

పరుల కొంపలార్పి పరభామలం గోరి
చేయరాని పనులు చేసిచేసి
యేడుకొండ లెక్కువాఁడు సద్భక్తుఁడై
నెగడె వాని జగము పొగడె బుద్ధ.

౮౪

నిదురలోన మునిఁగి నీవు నేనను భేద
వాదములను మ్రగ్గు భరతజాతి
మేలుకాంచె నాఁడు మీబోధ లాలించె
నితరులకును వెలుఁగు నిచ్చె బుద్ధ.

౮౫

క్రొత్త సుద్దులెల్లఁ గూరిచి తలమార్చు
నల్లకములు నల్లు లొల్లెగాఁడు
మచ్చనాలకాయున్న మానిసి దౌష్ట్యమ్ము
సుళువుగాఁగఁ జలుపఁగలఁడు బుద్ధ.

౮౬

కాకులందు మాలకాకి యెద్దులలోన
బాఁపనెల్ల నేఁటివఱకుఁ గలదు
భజనసమయరతలఁ బాటించి రీజాతి
కల్పనముల నెల్లకవులు బుద్ధ.

౮౭

నూటికొక్కరుండు నోరున్నవాఁడుండి
కడమవారినెల్ల గావుపట్టుఁ
బాపభీతిలేని పాములు పులులట్లు
పెంపులేక చెడిరి వీరు బుద్ధ.

౮౮

ఆరగింతు రగ్రహారంపుబడితలు
మేనికింత మలినమేనిలేక
బిచ్చమెత్తువృత్తి నచ్చినవారికి
ఛీల ఛాల లెక్కయేల బుద్ధ.

౮౯

పదవికొఱకుఁ దండ్రి ప్రాణాల బలిగోరి
పంచమాంగదళము పజ్జఁ జేరి
యింటిగుట్టు రచ్చకెక్కించి ప్రహ్లాదుఁ
డార్యజాతిదాసుఁడయ్యె బుద్ధ.

౯౦

ఆలినాలిమాట లాలకించి కులమ్మ్ము
గోడుగుడువ నన్నగుట్టు దెలిపి
పిఱికిపందయయి విభీషణుఁ డొరుఁజేరి
బడుగురీతి బ్రదుకుఁ గడపె బుద్ధ.

౯౧

పలుకుచుండు సభల బలి శిబి కర్ణుల
గాథలెల్లఁ దాను గబళ మిడఁడు
కతలు కంచికేగ మతిలేనివాఁ డిది
నమ్మిచెడును నిక్కువమ్ము బుద్ధ.

౯౨

రావు వెచట లేఁదురా యని పంతులు
బుడుతలకును బోధములను జెప్పుఁ
గాలు గదపనీయఁ డాలు చూలాతైన
గ్రహణ మనుచు వెఱచుఁ గాదె బుద్ధ.

౯౩

బ్రదుకులోని రుచుల వర్జించి నిర్జించి
యింద్రియముల నెల్ల నెండఁగట్టి
నీమతస్థు లెంతనిర్మోహులై రహో
పొరుగువారి సేమ మరసి బుద్ధ.

౯౪

పరుల తప్పు లెన్నఁబడువేళఁ జెడుగని
కొడలునిండఁ గన్ను లుద్భవిల్లుఁ
దనదొసంగుఁ జూచుకొనువేళఁ గన్నులు
రెండు మూఁతవడుచు నుండు బుద్ధ.

౯౫

బ్రతుకువఱకు శీలభంగమ్ము గానీక
మంచి నెల్లవేళఁ బెంచవలయు
నాదమఱచి నడువ నణఁగారు మరియాద
గాలిలోని దివ్వెగతిని బుద్ధ.

౯౬

దొరువులోని నీరు దోసిళ్లతోఁ జిమ్మ
నూరుచుండు దప్పి తీఱుచుండు
మంచితనము నిట్లె మర్దించి పుటమిడ
వన్నెవాసులెల్ల వచ్చు బుద్ధ.

౯౭

కాశిలోన నిలచి కన్నులు మూసిన
రామరామ యనుచు అంకెలిడినఁ
గలుగఁబోదు ముక్తి గట్టిగా శీలమ్ము
నిలుపుకొనిన మేలుగలుగు బుద్ధ.

౯౮

ఆసఁ గోసివేసి యఱపులు చాలించి
యెల్లరకును మేలు నెడఁదఁ గోరి
తిరుగువాఁడు నిన్ను మఱవని నెఱవాది
యిట్టివాఁడె యోగ్యుఁడెన్న బుద్ధ.

౯౯

ఖ్రింగ మెదుకులేక మీసాల కత్తరు
పూయఁగోరువారు పుడమిఁ గలుగ
శాంతి దాంతి యనెడు శబ్దమ్ము లేపాటి
విలువగలిగి నిలువఁగలవు బుద్ధ.

౧౦౦

పరులకు హింస యొనర్పక
పరహితమే హితమటంచు భావించిన నీ
గురుతర భావౌన్నత్యము
దరిసింపఁగఁ గోరి నిన్నుఁ దలఁచెద బుద్ధా.

---

೨೨ ೪೦

విడుఁగుఁజీర వీడి మగవారు మగువలు
గలసి మెలసి మడిని గట్టుకొనిరి
తరతరాలనాఁటి దావళికసకెల
మెండుకొనియె బుద్ధినిండ వేమ.

౨

ధనము తనువు మనము దైవతమ్మ్మును వీడి
నిర్గుణుండ నంచు నిక్కి యోగి
పరులు ముక్కు గోఁక బరుషమ్మ్మగాఁ దిట్టు
శాపమిచ్చుఁ దాల్మి సమసి వేమ.

3

కావిగుడ్డ మొలకుఁ గాళ్లకుఁ బాదుకల్
మెడకు "లింగకాయఁ" దొడుగుయోగి
పట్టుబట్ట వెండిపాదుకల్ బంగారు
లింగమందఁ జూచు లెస్స వేమ.

౪

ధనము మనకు శాశ్వతమ్మ్మగాదని పల్కి
సొమ్మ్మఁగూర్చు నాశ్రమమ్మ్మకొఱకు
మురికివెుడలికేల భోగమ్మ్మ వలదంచు
మాయదారి యగరు పూయు వేమ.

౩

పరము నిత్తుమంచుఁ బారదారికవృత్తి
మరగి తిరుగువారు గురువు లైరి
గుణము గుదురనట్టి కొంచెల కీపని
వీలుగాఁగఁ గానిపించె వేమ.

౬

కులబలమ్మ్మ పుంజికొనువేళ జనియించి
పైకులాల పెకు్కఁ బాఱఁద్రోలి
బీదబిక్క కింత విన్నాణముం గూర్చి
నేర్పితీవు పజ్జనిలువ వేమ.

౭

కల్లు పెల్లుద్రావి పైపెక్క బ్రహ్మ్మమ్మ్మ
నైతి నేనటంచు నఱచుచుండు
మత్తుదిగిన వెనుక మరియాద విడనాడి
పాపినంచు నతఁడె పలుకు వేమ.

౮

భుక్తశేష మిడియ పుచ్చుకొమ్మ్మా యంచు
నెంగిలింత తీసి యిచ్చు గురుఁడు
దండెసాఁచి శ్రద్ధానుఁడై శిష్యుఁండు
మిణకరించి దాని మ్రింగు వేమ.

౯

స్వామి ఋషి మహర్షి శబ్దమ్ము లీనాఁడు
పొగిలిపోయి సారమును దొఱంగెఁ
జిత్తశుద్ధిలేని జీవుల నివి చేరి
బిడియపడక గట్టిపడియె వేమ.

౧౦

అలఁతియలఁతి పలుకులందు జీవము నూఁది
ఘనులు సెప్ప నలవికాని వాని
వినిచితివి విశుద్ధ వేదాంతబోధల
నరఁటిపండు నొలిచినట్లు వేమ.

౧౧

కులము మతమటంచు గొణఁగెడి యయ్యల
లెక్క సేయకుండ నిక్కువమును
బరులముద్రకొఱకుఁ బ్రాకులాడకపల్కి
యిచ్ఛయశముఁ గంటివీవు వేమ.

౧౨

ఆత్మలోనఁ గల్గునది వచించుట మాని
చెప్పినట్టి దానిఁ జేయమాని
కవిత లల్లునాఁడు కాలూఁది యెదిరించి
నిలచితీవు ధర్మనిష్ఠ వేమ.

౧౩

కవికివలయు నిండుగారమ్ము వమ్ముగా
మెప్పుఁగోరి కవితసెప్పువారి
వెట్టి పోకడలకు విసువెత్తి పరువెత్తి
నీకలమ్ము నిజము నిలుప వేమ.

౧౪

బిచ్చమెత్తి సిగ్గు బిడియమ్ము వోనాడి
పరుల నాశ్రయించి పల్లకీలు
పొందవచ్చుఁ దాను బోయిన పిమ్మట
నిలువవలయుఁ గవితవిలువ వేమ.

౧౫

లాఁతివానిపెంపు రోఁతగాఁ దోఁచిన
విసివి విసివి గంగవెఱ్ఱు లెత్తి
కోఁతిమూఁక కింత గుణపాఠములు నేర్పి
నీ చరిత్రగతులు నిల్చి వేమ.

౧౬

తల్లి దండ్రి గురువు దైవ మ్మాటందురు
మొదలఁ దల్లిదండ్రు లుదిలకొనఁగ
దేవతలకు గుళ్ళు దీర్తు రేమిదివెఱ్ఱి
యిరుగు పొరుగు మెప్పుకొఱకు వేమ.

౧౭

తాఁకి తలఁపనట్టి దరిబేసితో మైత్రి
చిత్తమునకు గండకత్తె రగును
హద నెఱింగి సాయ మందిచ్చు వానితోఁ
జెలిమిసేయ సుఖముగలుగు వేమ.

౧౮

తనకుఁగానివాని మనసెఱుంగనివాని
మంచిదెలుప నేవగించువానిఁ
బలుకరింప నాపదలు గూర్ఁగలవానిఁ
గూడిబ్రదుకఁ గీడుమూఁడు వేమ.

౧౯

డెప్పరములు వచ్చి కప్పిన మప్పిన
దేశకాలములకు దీలుపడని
బుద్ధివిభవ మెప్పుపురుషుండె పురుషుండు
గానివాఁడు నరుఁడుగాఁడు వేమ.

౨౦

కలిగినపుడు మిగులఁ గులుకక లేమిడి
పడిననాఁడు పేదవడక చెడక
నీతి నియమములకు నిలిచిన మనుజుండు
చెడని పడని కీర్తివడయు వేమ.

౨౧

తనకుఁ దగినరీతి దానమ్ము ధర్మమ్ము
కలిమి బలిమిఁ జూప గౌరవమ్ము
మేరమీఱ నేకుమేకొను బదుగురు
పరిహసింప భంగపడును వేమ.

౨౨

సిరులఁ దూఁగు లాఁతి శిరసా వహింతురు
నేనివానిఁ జుట్టమైనఁ గనరు
వెట్టి మొట్టి జనుల వేదాంత మిట్లుండు
సత్తు చిత్తులందు సమసి వేమ.

౨౩

మెఱుఁగుఁ బెట్టువారు దొరకిన మెఱయును
దొరకకున్న ముడుఁగు దుర్బలుండు
గోఁగునీటఁ దుడువ రాగిల్లు నిత్తడి
తుడువకున్నఁ గాంతిఁ దొఱఁగు వేమ.

౨౪

పనియుఁ బాటులేని పలుగాకిమూఁకల
తలఁపులందుఁ జెడ్డ మొలక లెత్తుఁ
బదుగు రెక్కనట్టి బాటలో గాదమ్మ్రి
మోసులెత్తి దారి ముంచు వేమ.

౨౫

దూడలకును బాలు దొలఁగించి యావులఁ
దల్లులంచుఁ బాలు ద్రావుచుండు
రాలు తల్లులైన నాఁబోతు లేమానొ
తలఁపరేమి యేమి తెలివి వేమ.

౨౬

గొఱ్ఱె బఱ్ఱెపాలు కోకొల్లగాఁ ద్రావి
తల్లియంచుఁ బలుక నొల్లరైరి
ఆవు వీరికేమి యబ్బచుట్ట మ్మొక్కో
పలుక రేమి నిజము తెలియ వేమ.

౨౭

అనుభవమున దూరమై నిత్యసత్యమ్ముఁ
బలుక లేని శాస్త్రములను నమ్మి
మోసపోయి శాస్త్రదాసానుదాసులై
మొఱ్ఱులిడుము రేమివెఱ్ఱి ! వేమ.

౨౮

పెట్టినట్లు దినుము గిట్టినట్లుండుము
చెప్పినట్లు వినుము శిష్యయనుచు
బోధసేయు పుణ్యపురుషులు గురులైరి
దేశమున కిఁకేమి తెన్ను వేమ.

౨౯

చూచువారికెల్ల సుమతిగాఁ దోఁచును
వేషభాషలందు వెలితిలేక
నిత్యవృత్తియందు నెరసులు దొలఁకాడు
బ్రదుకుఁ గడపునట్టివాఁడు వేమ.

౩౦

మెత్తఁదనము గల్గు నుత్తము మెచ్చరు
దుడుకువాని నెపుడు దూరుచుంద్రు
మంచిచెడ్డ లిట్టు లెంచుచో జనులకు
నిలువనీడ దొరకఁగలదె వేమ.

౩౧

అన్నమైన సున్నమైన నొక్కటియని
వాఁగువారు కర్మదోగు లైరి
పట్టివర్ధనముల భ్రమపెట్టి యెల్లర
నాఁచికొనిరి సౌఖ్యమంద వేమ.

౩౨

పద్యమల్లలేని పండితమ్మన్యుండు
యతులు ప్రాస లెల్ల నతుకుపఱిచి
కావ్య మిద్దియంచు గంతులు వేసిన
హృదయమున్న మెచ్చరెవరు వేమ.

33

నిజముపల్క వ్రాయ నిందించు లోకమ్ము
వట్టికూఁత గూయ వ్రాయఁ బొగడు
ముసిఁడికాయఁ దెచ్చి మసిపూసి మారేడు
కాయఁ జేయువాఁడె ఘనుఁడు వేమ.

34

పరులు భక్తుఁడంచు భావింతు రనియెంచి
శిలలఁ దెచ్చి ముక్కసెవులు సెక్క
దేవుఁ డనుచు లేనిభావమ్ము గల్పించి
వంచకుండు మోసగించు వేమ.

35

ఆరగింత సేయ నంగీకరించుచో
ముఱికి ముట్ర వెలికిఁ బోవు కెట్లు
ముట్టకున్నఁ దిండివెట్టుట మోసమ్ము
దీనిఁ దెలియ లేల పూని వేమ.

36

ఈప్సితమ్ము దీర్ప నేఁటఁ బవళింపు
సేవఁ జేయ సంతు చిక్కఁదాయె
ఫలము లేనిపనికి బారలు చాఁపఁగా
సంశయింపఁ డేమి జనుఁడు వేమ.

38

ఎద్దునెక్కువాఁడు గ్రద్దనెక్కెడు వాఁడు
తెలుపు నలుపు రూపముల ధరించి
యెల్లవారి నల్లకల్లోలముం జేయఁ
గలసికట్టుబ్రదుకు దొలఁగె వేమ.

39

గొప్పవారిఁ జూచి గోసాఁడు కుజనుండు
దనచరిత్రఁ దాను దలఁపఁబోఁడు
పరుల వెక్కిరించు పట్టుల ముదికోఁతి
యాత్మరూప మరయనట్లు వేమ.

3౯

కొంకుటొంకు లేని కూఁతల నాల్గింటి
వల్లెవేసి యవియె వాఁగు సభల
గడపగడపముందు బుడుబుడుక్కని బోలి
యొక్కరీతిఁ బలుకుచుండు వేమ.

40

బావిలోని కప్పవలె లోఁతి లోకమ్ము
జూడఁ జూడఁబోని ఛాందసుండు
తనకులమ్ము తనదుధర్మమ్ము ఘనముగాఁ
బలుకుచుండు సిగ్గుపడక వేమ.

౪౧

అచ్చుఁబోసి విడుచు నాఁబోతువలె నీతి
విడుచువాఁడు గౌరవింపఁ బడఁడు
నియమమునకు లొంగి నిల్చిన విఖ్యాతి
గలుగుఁ దనకుఁదానె వలచి వేమ.

౪౨

అడ్డగాలు వేసి యాటంకము లొనర్చి
మడ్డెతనము సూపు మనుజుఁ డెపుడు
సడ్డసేయఁబోఁడు జంకఁడు పైపెచ్చు
దొడ్డవారితోడ దొరయు వేమ.

౪౩

అగ్రజాతివార లల్లాడ ధర్మధ్వ
జమ్ము నిల్పితీవు సత్య మరసి
సుప్రతిష్ఠితంపు సూక్తు లాచంద్రార్క
మతిశయిల్లు దెసలనంటి వేమ.

౪౪

పాఁచినోటివాఁడు పరులర క్తముఁ బీల్చి
కొదవ యొదవుననుచుఁ గూడు దినఁడు
లేమి యొదవునాఁడు భూములు పట్టుచుఁ
దేనెటీఁగరీతిఁ దెరలు వేమ.

౪౫

ధనము విద్యగల్గు ధన్యాత్ముఁ డొరులకుఁ
బాలుపంచి కీర్తి వడయవలయుఁ
బనికిమాలినట్టి భావమ్మ్నితోఁ జన్న
నూరుపేరు లేక యుడుగు వేమ.

౪౬

పవలు రేలు నాక పాఱెంత పడినను
బొట్టనిండ బువ్వ పుట్టఁబోదు
కష్టమొకరిపాలు కల్మి యొక్కరిపాలు
జోగి యొక్కఁ డొకఁడు భోగి వేమ.

౪౭

బ్రతికియున్ననాఁడు మెతుకింత వెట్టక
పెదవివిప్ప నడ్డివిఱుగఁ బొడిచి
యాత్మశాంతిఁ గోరి యయ్యల నమ్మ్నిల
నామెతలకుఁ బిల్తురేమి వేమ.

౪౮

ఎదుటఁ బడినయప్పుడు హృదయ మిచ్చినయట్లు
మాటలాడి కన్ను చాటుగాఁగ
వెక్కిరించు వారె విపులకు భారమ్మ్ని
కరులు గిరులు బరువుగావు వేమ.

౪౯

కాలవశతఁ గల్గు కల్మిచేఁ గైపెక్కి
విఱ్ఱవీఁగుచుండు వెఱ్ఱిమొగము
గాలిపాటుదప్పి కష్టమ్మ్మొవచ్చిన
వెగడుపడుచుఁ జింపు వేయు వేమ.

౫౦

కనులు దేలవేసి కాటికిఁ గాళ్ళార్చఁ
జూఁపునాఁడు గాంకు చావఁబోదు
ప్రాణమున్నవఱకుఁ బరువెత్తు నూహల
నల్పబుద్ధి యెట్టులాఁపు వేమ.

౫౧

ఆఁకవెట్టు కామినీ కాంచనమ్మ్ములఁ
గాలరాచి మోక్షగామి వగుచు
నిల్చినాఁడ వీవు నిర్గుణమ్మ్మును గొల్చి
సాటిలేని ప్రతిభఁ జాటి వేమ.

౫౨

పైకి వేసములను ప్రకటింపగాఁ బోరు
లోన మధురగుణము లూనుచుండ్రు
మంచివారు వారి మర్మ్యాదయే తెల్పుఁ
బనసకాయ తొనలవలెను వేమ.

౫3

వేసబాసలందు వింతవింతగఁ దోఁచి
వదరుచుండు నీతి వదరుఁబోతు
విప్పిచూడ నడత వెలివాలె నుండక
మేడిపండు రీతి మెలఁగు వేమ.

౫౪

తలఁపులకును నెపుడు తటిమెన వట్టినఁ
బాదరసమురీతి పరువులెత్తుఁ
జూచి చూడకున్న సోమరితన మెచ్చి
భావములును మొండిపాఱు వేమ.

౫౫

కప్పురంపుఁదావి గుప్పున వాసింపఁ
దెలుఁగురాణి పలుకు తియ్యఁదనము
లన్నిఖండములకు నందించి చవులూరఁ
జేసి తీవు కవితసెప్పి వేమ.

౫౬

బాఁకు దూసినట్లు పలుకొక్క ములికిమై
చెడ్డతనము నెల్లఁ జీల్చివైచె
గూఁడుకట్టుకొన్న కుల మత ధర్మముల్
దూలెఁ గలముపోటుతోడ వేమ.

౫౭

కానివావియయ్యెఁ గంచంత కాఁవుర
మ్నాత్మ్నలో వికార మణఁగుకతనఁ
దల్లడిల్లిపోయె నెల్లభోగమ్ములు
గురుఁడు నొసట భూతిఁ గూర్చ వేమ.

౫౮

గుండె రాయిచేసికొని మూఁడువాసనల్
వెంట నంట వాని గెంటివేసి
యెఱుకజోలి మాలి పరిపూర్ణతత్వమ్ము
నంది పొంది యోగివైతి వేమ.

౫౯

గుట్టు దెలియనట్టి గురులు నీబోధన
ములను వినుచు విస్తుపోయినారు
మతమతాంతరముల మాత్సర్య మెసరేఁపు
ఖతులు సైత మోసరిలిరి వేమ.

౬౦

కన్ను మూసి తెఱచి కనినంత వెనువెంట
భూమి విశ్వదాభిరామ మయ్యె
విశ్వదాభిరామ విజ్ఞానఖని నీకు
సులభమైన దారిసూపె వేమ.

౬౧

చెనఁటి చెప్పునెపుడు శ్రీరంగనీతులు
దూరుచుండు నెపుడు దొమ్మరిండ్లఁ
గొంగజపమొనర్చు నంగనాచుల కివ్వి
మంచిగాను గానుపించు వేమ.

౬౨

లాఁతిదేశములకుఁ బ్రీతిఁ జేకూర్చును
దెలుఁగుబాసలోని తియ్యఁదనము
నొగులుసొదు ముదు నోరారఁ బల్కఁగా
దెలుఁగువాని కేమి తెగులు వేమ.

౬౩

కొండవీటి విభుల యండదండల నంది
గణుతికెక్కె నాఁడు దెలుఁగుకవిత
కొండవీటి సుకవికుంజరు నుడికార
మాటవెలఁది రూపమండె వేమ.

౬౪

కుప్పఁజేసి యవచితిప్పయ్య కస్తూరి
పంచిపెట్టె సుకవిపండితులకుఁ
దత్పరీమళమ్ము దనువంట మనసంట
నీయకుండ మెలఁగి తెట్లు వేమ.

౬౫

కళలయందు నేను గడిదేటితి నటంచుఁ
బొగరుఁబోతుతనము పూనవలదు
తాడిఁ దన్నువానిఁ దలదన్నువాఁడుండు
దంబ ముడిగి మెలఁగఁ దగును వేమ.

౬౬

గడియ కొక్కరీతి కప్పదాఁటులు వేయు
పాపి చెడుగొనర్వ భయపడండు
తెలివి నిచ్చినట్లు నిలువునఁ జంపెడు
సన్నిపాత మట్టు లెన్న వేమ.

౬౭

గొప్పవారితోడ ముప్పు గయ్యమ్మైన
వియ్యమైన లేక నెయ్యమైన
సములతోడఁ గూడ సౌఖ్యమ్ము వాటిల్లు
జోటు నెఱిఁగి మెలఁగ సుఖము వేమ.

౬౮

కట్టి గుడియ కత్తి గండ్రగొడ్డలి నాఁడు
దైవములకు నాయుధమ్ము లయ్యె
నేఁడుగూడ నవియె నిల్పుచో దేవత
లంగలింపకుండు రయ్య వేమ.

౬౯

చిన్న విషయములను జీటికి మాటికిఁ
జివ్వగోరి కాలుగ్రువ్వరాదు
పోరు నష్టమనియుఁ బొందు లాభమ్మని
పెద్ద లాడుకొనెడు సుద్ది వేమ.

౭౦

గంజి గట్ర ద్రావఁగా లేని నిఱుపేద
యందలముల నెక్కి పొందఁగలఁడు
కూటిరాయి దీసికొనలేని బలహీనుఁ
డేటిరాయి తీయు నెట్లు వేమ.

౭౧

ఉప్పుగల్లు లేక ముప్పంచుమును ద్రావి
కడుపుమంట లార్పఁగడఁగు బడుగు
పెరుగు మెఱుఁగు మెక్కి యఱుగక కలవాఁడు
బ్రింగు మందు పీఁటమీఁద వేమ.

౭౨

ఒడలెబరువు కీర్తి యుబలాట మారాట
పఱుప వీడిపోయెఁ బ్రాసయతులు
శాస్త్రసిద్ధమైన సాహిత్య మడుగంచెఁ
గలుపు పెరిగి పైరు నలఁగె వేమ.

౭౩

జీవితమ్మునందు సిద్ధాంతములయట్లు
భాష కుండుఁ గట్టుపాట్లు గొన్ని
నీతి లేనివాని రోఁత జీవితమట్లు
గ్రామ్యవాద ముండుగాదె వేమ.

౭౪

వ్రాతప్రతులయందు రారాని దోషముల్
సేన వేలు వచ్చి పీటవెట్టుఁ
దమకుఁ దోఁచినట్లు దప్పుదు పద్యాల
గలిపినారు నీవిగాఁగ వేమ.

౭౫

విశ్వదాభిరామ వినుర వేమయటన్న
జీవమకుట మెట్లు చిక్కెనయ్య
నాఁడు నేఁడు ముందునాఁ డిట్టి మకుటమ్ము
పాదుకొలుపఁ దరముగాదు వేమ.

౭౬

మానహానికంటె మరణమ్మె మేలని
పౌరషమ్ము నమ్మువార లగుట
నేండ్లుపూండ్లు బ్రదికి యేనాఁటి కేపాప
మాచరింప రిద్ధయశులు వేమ.

22

ఆరుగాల మఖిల మారగించెడు వారు
మన్నిగొనిరి మిమ్మ్మో దిన్నయింటి
వాసములను లెక్కవేసెడి సాములు
పాపమునకు వెఱఁగుపడరు వేమ.

23

మంచితనమునకును మరియాదఁ గల్పించి
వంచి చెడును దుంపతెంచినారు
కడకు నమ్మ్మివారె కత్తుల బావిలో
ముంచినారు స్వార్థమునకు వేమ.

24

నోరుచెవులు గల్గి యేమోటి కాపాట
పాడుచుండి పరులపాట వించుఁ
దిరుగువాఁడు ప్రొద్దుతిరుగుడు పూవుగా
నాభిజాత్య మెల్ల నణఁచు వేమ.

25

వెదకి వెదకి యోగి వేమన్న యే కాని
పరుఁడు గాఁడటంచు బ్రహ్మ్మగురుఁడు
సత్యమును వచించి జయభేరి చఱచెరా
యెల్ల దెసలు బూరటిల్ల వేమ.

౮౧

భావదాస్యమునకు భాష ముఖ్యమ్మని
తెలుఁగునుడులఁ దేనె లొలుకఁజేసి
"వీరబయళ్ళు" లందు వెలసి మాజోహారు
లందుకొంచు నుంటివయ్య వేమ.

౮౨

అడుగుజాటి క్రిందుపడిన వారలఁ గూర్చి
యాయువెల్ల ధారవోయువారిఁ
జిత్తశుద్ధితోడ సేవింతు రెల్లరు
మూఁడువేళలందు మొనసి వేమ.

౮౩

మౌక్తికములపేట మాణిక్యముల మూట
యటుల సభల మాటలాడ నేర్చి
కాకి గ్రద్ద గ్రద్దఁ గాకిగా మార్తురు
మనసుఁ జెఱిచి యల్పమతులు వేమ.

౮౪

పుటుక బ్రహ్మకులము పురము లంకాపురి
జగములెల్ల గెలుచు సైన్యపతులు
గలిగి రావణుండు గడతేఱె రాముచే
గుండ్లుదేలి మునిఁగె బెండ్లు వేమ.

౮౫

మతము కులమటంచు మత్తుమందునుజల్లి
పొల్లు ధర్మములను వల్లెవేసి
ధర్మ మణఁగెననుచు దద్దటిల్లు నొకండు
కప్పకూఁత పాముకరణి వేమ.

౮౬

తల్లిబాస మొదట వల్లించి యాపైని
నెఱుఁగ మేలుగలుగుఁ బరులబాస
నేలవిడిచి సాము నేఁ జేయుదు నటన్నఁ
బుట్టువెట్టి నవ్విపోఁడె వేమ.

౮౭

తేనెసోనవంటి తెనుఁగును దెగనాడి
యా త్తరాహులకును నంజలించి
తిరుగుచున్నవారు తెనుఁగమ్మ బిడ్డలై
మొప్పె లగుచు దారితప్పి వేమ.

౮౮

చదువువలన నీతి సమకూడ లాభమ్ము
నీతిలేని చదువు రోఁతగూర్చుఁ
జదువుగాదు ముఖ్యసాధన మూహింప
నడత మంచిదైన నయము వేమ.

౮౯

ఏటుపోటుమాట లెంతగా నేర్చిన
గౌరవమ్ము దాన గలుగబోదు
చేత వాత సిద్ధిచేకూర నలువురు
గలసి పూజసేయ గలరు వేమ.

౯౦

ఆస మానసమున నంకురించిన యేని
పరుల కాళ్లుమ్రొక్కి ప్రస్తుతించు
గాని యైనవాని కడ నోగులొడుచును
గాలి సోకువాని కరణి వేమ.

౯౧

ఆస దీసివేసి యానందముం జెందు
యోగికంటి కోగుబాగు లేదు
భోగి జోగి యనెడు పొరపొచ్చెములు లేక
చీకు చింత లేక చెలగు వేమ.

౯౨

రాతిపూజ జేసి చేతవ్పు వాతవ్పు
నదుమ జూచువారి బ్రదుకు గడిగి
తెలుగువారి కింత తెలివితేటలు గూర్ప
బూనితీవు గంటమూని వేమ.

౯౩

విషయములకు లొంగి వీఱిడి యయిపోయి
తీర్థరాజమ:లను దిరుగు జనుఁడు
చేసినట్టి తప్పు కాసెలో నుండఁగాఁ
గాశికేగ ఫలము గలదె వేమ.

౯౪

చెట్టువట్టి పనులఁ బట్టుదలంగూరి
కానిపనులఁ జేయఁ గడఁగువారి
ననుఁగుసుతుల రీతి నదలింత్రు పెద్దలు
వినక చెడిన నేమి యనరు వేమ.

౯౫

పొరుగుగడపఁ ద్రొక్కి పొమ్మన్న రమ్మన్నఁ
దిరుగ మరగినట్టి త్రిమ్మరీఁడు
ఆలిచెంతఁ జేరి యనసూయ సీతమ్మ
కతల వినిచి భయము గఱపు వేమ.

౯౬

అన్యునింటఁ బాయసాన్నమ్ము మెసవియు
బెంగవడును మిగుల బెగ్గడిల్లుఁ
గప్పపడినఁ గల్లు గంజిగత్రయుఁ ద్రావు
జీవి యెడఁద సంతసిల్లు వేమ.

౯౪

కడువునిండఁ దినక గడ్డకుఁ బుట్టెఁడు
నీరుద్రావి నీతి నిలుపుకొనిన
శైతుజాతిలోని రక్తమ్ము నీలోనఁ
బ్రతిఫలించు నుడులఁబట్టి వేమ.

౯౫

పెళ్ళుచుమాట నోట వెలలింప కుండుట
తనకుఁదానె పొగడుకొనక యుంట
ధనము రూప మబ్బఁ దబ్బిబ్బు గాకుంట
యుత్తములకు సాజ ముర్వి వేమ.

౯౬

నీవు పుట్టినట్టి తావునఁ బుట్టితి
నిన్నె కొలుచుచుంటి నేటిదనుకఁ
గొండవీటిసీమ నుండెడు వాఁడను
గొండవీటి గోత్రజుండ వేమ.

౯౭

లోకులు భాఁకులు దూసిన
నాకేమని సత్యమనుచు నమ్మినదానిన్
వాకొను సుస్థిరధైర్యము
నాకొసఁగుము నిన్ను నమ్మినాఁడను వేమా.



విందులంద బదవి వెలిగింపు లెఱిగింప
బత్తెములును గిట్టుబాటు నంద
సచివవరులు నేడు సంచార మూరూర
జరువుచుంద్రు కాళ్ళు లఱుగ గాంధి.

౨

ప్రాణ ముగ్గవట్టి పలుశ్రమమ్ములకోర్చి
వెళ్ళిగొట్టి తీవు తెల్లదొరల
నెరకుబెనగు డేగ లురవడి నాయకు
లాత్రపడిరి పదవు లంద గాంధి.

3

త్రాటగట్టి వులుగు దైతెక్కలాడించు
బాలుపగిది సంస్థ బాదమూన్చి
కొంచెలెల్ల నేడు కోలాహల మొనర్చి
నాయకుల నణంచినారు గాంధి.

౪

నిన్న మొన్నవఱకు నిర్భాగ్యుడగువాడు
దోకచుక్కరీతి బ్రాకిపోవ
దేశమునకు నెట్టి తిప్పలు మూడునో
వాకొనంగ నెవరివశము గాంధి.

౩

బ్రతుకుఁ దెరువుకొఱకుఁ బాశ్చాత్యభాషలఁ
జదువ్రుఁ దానఁ బదవి సౌఖ్యమందుఁ
దినుచుఁ దిట్టుచుండు మనకిది దగదంచు
లేకియగుచు సిగ్గులేక గాంధి.

౪

కుడువఁ గట్టఁ గల్లు కోటీశు నాటోప
మరసి యెల్లవార లభినుతింత్రు
తిండిలేక యెండి దేవురించెడు వారి
నాదరించి పాపమనరు గాంధి.

౭

పరులపొట్టనింపఁ బవలు రేలును నాక
కష్టపడెడువానిఁ గడకుఁ ద్రోసి
సాధుజనుల నెవుడు బాధింప నెంచుచో
దేశమునకు లేదు తెన్ను గాంధి.

౮

మాల మాలయంచు మాటాడు వాచాట్యు
లున్నతంపుఁ బదవి నున్న మాల
కాళ్లుగడ్డములను గడిగి పూజింతురు
వంచనాత్ము లిట్టివారె గాంధి.

౯

కష్టపడెడు జనుల కళ్యాణముం గూర్చి
మాన మూనుటంత మంచి దగునె
కడుపుమంట లేఁచి కాలానలమ్ములు
నింగితాఁక జగము గ్రుంగు గాంధి.

౧౦

దివ్యచిత్తమునకుఁ దేవలెనని కోరుఁ
జిత్తమింతలేని చెడుగ నెపుడు
కాలమునకు లొంగి కడుపు కక్కుర్తికై
మాటవిలువ నిలుపమాను గాంధి.

౧౧

పెద్దతనము గోరి పీఁటల నాసించి
పెఱుల నణఁప గంగవెఱ్ఱు లెత్తి
చెలఁగువారు పెద్దచేఁపలై తమజాతిఁ
బట్టిక్రుంగ వెఱఁగుపడరు గాంధి.

౧౨

నిన్న మొన్నవఱకు నిలువ నీడయులేని
యనద యిపుడు పదవినంద నంద
తాగడమ్ములతోడ స్వాగతమ్ములు వల్క
జంకరేల భజనసలుప గాంధి.

౧౩

దొంగతిండి మరగి దొరలట్లు గొందఱు
మోసమునను బొట్టఁ బోసికొంద్రు
నిలువ నీడలేని నిఱుపేద నీతికై
యొడలువంచి కష్టపడును గాంధి.

౧౪

పరులమీఁద నాసపడి జీవనముసేయు
నలసునకును సౌఖ్యమబ్బఁబోదు
చెమటఁదీసి వేసి సేద్యమ్మ్మునేసెడు
వాఁడు పరులఁ గొల్వఁబోఁడు గాంధి.

౧౫

గచ్చగదలినట్లు గాడిదగత్తర
సేయఁ దోడివారు సిలుగులందఁ
బొట్టఁ బోసికొనెడు పోకిరి మూఁకల
పెత్తనమ్ము దెసలనెత్తె గాంధి.

౧౬

కోడితోడ మేలుకొని ప్రొద్దుపోయెడి
వఱకు దున్ని దోఁకి వచ్చువారు
గంజి కంగలార్వఁ గడుపుబ్బ సోమరి
మూఁక తినును ముక్కుమునుఁగ గాంధి.

౧౭

కవులు వెంటనంటి కైతలు వినిపింప
దెలియకున్న దలను ద్రిప్పుచుండు
పదవియందునున్న బైరాగి; వానినే
కలియుచుండు రెల్లకవులు గాంధి.

౧౮

పదవియందునున్న బ్రహ్మరథమ్ములు
పట్టువారు పదవి వదలిపోవ
మాటలాడరారు మరియాద నిడబోరు
వాటమెఱిగి నీరు పాఱు గాంధి.

౧౯

కల్లబొల్లులెల్ల గనిపెట్టి మెలగెడి
బుద్ధిజీవు లేలు పుడమిలోన
బూటకంపు జనుల యాటలు కట్టవా
మిడిసిపాటులెల్ల సుడిసి గాంధి.

౨౦

అంతుపొంతులేని యారాటమున జిక్కి
పదవి పదవియంచు వదరువాడు
తుదకు గద్దెనెక్కి యదలించు నర్హుల
నంటుగాండ్రు వెంటనంట గాంధి.

౨౧

బడుగు మేలుగోరి ప్రాజ్ఞుండు తినమాని
చేయి విడ్రుచుఁ గడుపుచిచ్చు మాన్ప
లాలసుండు గడుపుకై లాసముగ నెంచి
పొరుగు మంచి మఱచిపోవు గాంధి.

౨౨

ఊరిపనుల కెల్ల నుమ్మాయ జగ్గాయ
లుట్టిగట్టుకొంచు నూఁగుచుండ్రు
తమకుఁగాని పెద్దతనమున నిల్తురు
జబ్బచఱచి యొమ్మ్రొలుబ్బ గాంధి.

౨౩

పదవి దొరక విఱ్ఱుగఁబడిన లాభములేదు
తరతరాలు నీతి నరుని నిల్పు
నుమ్మ ఖ్రింగఁ గడుపు చుమ్మ్రలు తీఱునా
కడుపునిండఁ దినఁగ గాక గాంధి.

౨౪

కట్టఁ గుడువఁ బరుల కష్టమ్మ్ర నాసించు
కొంచెలెల్లఁ బెద్దకొడుకు లైరి
నట్ట దున్ని పెట్ట గుట్టమ్మ్ర తెగమేయు
ముక్కుమునుఁగ శాణమునను గాంధి.

౨౩

మొలకుఁ జాలనట్టి ముదుకబట్టను జుట్టి
చాలనట్టి మేఁకపాలఁ ద్రావి
నాయఁగట్టి కడుపు నాదేశ మిడియని
నిలిచితీవు పగతు రులుక గాంధి.

౨౪

గ్రామసీమలందుఁ గాలూఁద నీయక
కులము బలము డులుపఁ గూలిపోవు
నట్టివారి నంటి హరిజనులని తొల్లి
వంగడమ్ము గుర్తెఱింగి గాంధి.

౨౫

చేతివృత్తులందు జీవమ్ము గలదంచు
మూలమూల జనుల మేలుకొలిపి
కూలివాని గోడుగుడిచి కూలఁగ నీక
తావుచూపి నిల్పితీవు గాంధి.

౨౬

కదురుకవ్యమాడఁగాఁ గల్లు సిరులన్న
తరతరాల నాఁటి ధర్మసూక్తి
వెలికిఁ దీసి తిరిగి వినిపించి లేముల
ముసరనీవు దేశమునను గాంధి.

౨౯

కొఱతదీఱ నేడు కొక్కెరాయులు గూడి
యర్వాతలు గడించి యట్టుచాఱి
బాధితులమటంచు "బంజరు" భూముల
నాఱిచికొనిరి బిడియ మడఱగి గాంధి.

౩౦

చిత్తశుద్ధి లేని జీవు లొక్కుమ్మడిఁ
బదవులంద దేశభక్తు లైరి
మేకవన్నెపులుల తాడిడి మెండైన
సంఘగౌరవమ్ము సమసె గాంధి.

౩౧

తలకు-టోపివెట్టి మొలఁజుట్టి ముడిబట్టఁ
బట్టెవర్ధనములఁ బెట్టి నొసట
సభల నీతిబోధ సలిపెడు వారలే
యేవమునకు జంక రేమి గాంధి.

౩౨

మతమతాంతరమ్ము లతగులచే మున్ను
గల్పితమ్ములంచుఁ దెల్పి జనుల
మతము లెన్నియైన మార్గ మొక్కటియని
వినిచితీవు కొట్టకొనకు గాంధి.

33

సమసిపోయె నేఁడు సత్యధర్మాహింస
లాదుకొనెడు పూజ్యపాదు లేరి
పరులమెప్పుఁగోరి పారాయణ మొనర్చు
వేసగాండ్రు వెల్లివిరియ గాంధి.

34

జనులఁ గూడఁగట్టుకొనువేళఁ దనదారిఁ
దొలఁగకుండువాఁడె దొడ్డవాఁడు
తలకుమించినట్టి ధర్మమ్ము తలపెట్ట
కుండువాఁడె యుత్తముండు గాంధి.

35

తోడివారు తనకు నీడుగాఁ దోఁచిన
ముడుఁగఁబాటి మోము ముడుఁచు ములుచ
తనకు మించువాని దర్శించి హర్షించి
నుతియొనర్చు సజ్జనుండు గాంధి.

36

జాతి కింతసేగి జరిగిన వెనువెంటఁ
గాకిబలఁగమెల్లఁ గావు మనును
దోడివాని కెట్టి తొందరమూఁడినఁ
జూడఁడేమి సాటివాఁడు గాంధి.

36

పదవి నిత్యమంచు భావించి గర్వించి
బిబ్బిబిగిసి వెట్టి విబ్బివీఁగు
నీటిబొఁద బ్రాత నిలుచునా నిలువదా
యనుచుఁ దలఁపఁడేమి జనుఁడు గాంధి.

37

కోర్కి లేనినాఁడు గుమిగూడి యెల్లరు
పీఠములను గట్టఁబెట్టు చుందు
రారటమ్మ్మి సెంది యాయాసపడునాఁడు
మోమువంకఁ జూడఁబోరు గాంధి.

38

ఎల్లవారు దన్ను నేవేళఁ గొల్వఁగాఁ
గోరువాఁడు బెంగఁగూరుఁ దుదకు
నీడఁ జూచి బెదరువాఁడు కోడిగముల
పాలువడును మేలుపడఁడు గాంధి.

39

ఇరుగుపొరుగువారి కేమాత్రమైనను
సాయపడిన బ్రదుకు సార్థకమ్మ్మి
పొల్లువడిన పుల్ల పల్లుగుట్టుటకైనఁ
బనికివచ్చు సమయమునకు గాంధి.

౪౧

సొంతనేల కింత సుకము చేకూర్పక
ఫలమె లాఁతినేలఁ బరువు లిడఁగ
నైనవాని కాకు కానివానికిఁ గంచ
మిడినమాత్ర లాభమేమి గాంధి.

౪౨

చెప్పినంతవట్టు చేయఁ గీరితిఁ గాంచుఁ
గుదురకున్న నోరు మెదపరాదు
ఒకనినెట్టి ముందునకు నవ్వుచుండెడు
పాపిగనునె ముక్తిపథము గాంధి.

౪౩

మున్ను గొంతదొలఁగె మూఢవిశ్వాసమ్ము
లొత్తుకొనుచుఁ బిలక లెత్తె నేఁడు
సర్వజాతిసమత సాధించు సంస్కారు
లుద్భవిల్ల మేళు లొలయు గాంధి.

౪౪

కడుపు నింపుకొనెడు చెడుగఁడొక్కఁడు చాలుఁ
బరుల జీవధనముఁ బట్టిమ్రింగ
జడధిఁ బీల్వ నొక్కబడబానలమె చాలుఁ
బుట్టుచోటు మట్టువెట్ట గాంధి.

౪౫

ప్రజలమేలుగోరి ప్రాణమ్ము లర్పించు
పుణ్యపురుషులెల్లఁ బోయి తుదకుఁ
బరుల రద్దిసేయు పనిఁబూను కిగ్గాడు
లడుగు నిడిరి సంస్థయందు గాంధి.

౪౬

సేవసేవ యంచుఁ జిందులు ద్రొక్కుచు
నోరు కాయగాయ నొడివి నొడివి
దిక్కుమాలినట్టి దేబెమూఁకల నెల్లఁ
గూర్చువాఁడె నాయకుండు గాంధి.

౪౭

గొంతువఱకు మెక్కి గొంతెమ్మ కోర్కెల
నుబుసుపోనివార లొకఁడవంక
కూడు గుడ్డ కొంప గొడ్డుగోదలు లేక
పనవువార లొకఁడవంక గాంధి.

౪౮

కడుపుమంట లార్పఁగా దారి పాడటి
పంది కుక్క గవియఁ బాఱఁద్రోలి
వీధిలోన విసరు విస్తళ్లమెదుకుల
గతుకువారు నేఁడు గలరు గాంధి.

౪౯

పలువురున్నచోట వాయెత్తి బాసాడి
యంటరానితనము గెంటివైచి
యింటబయట రెంట నంటు సంకోచించుఁ
గులమువార లెదుట నిలువ గాంధి.

౫౦

శాంతచిత్తు లగుచు సమయమ్మునకు వేచి
కాచియుండువారి కర్జమగును
బనికిమాలినట్టి పరవళ్లు ద్రొక్కినఁ
గార్యహాని తుదకుఁ గలుగు గాంధి.

౫౧

పలుక నేర్చి బట్టతలకు మోఁకాలికి
ముడులువెట్టి ప్రొద్దుపుచ్చువారు
కొండ్రదున్ని బ్రదుకువాండ్రతో సాటిగాఁ
బోరు నూరుజన్మములను గాంధి.

౫౨

పరుల నతకరించు పాపాత్మ లీపంచ
భూతములును మాకు భుక్తమండ్రు
నేల నీరు నిప్పు గాలి మి న్నెవ్వని
యబ్బసొమ్ము మెఱుఁగ రైరి గాంధి.

౫౩

రక్తపాతముననె రాజ్యమ్ము సమకూరు
ననెడు పలుకుపలుకు నణఁచి వైచి
ధర్మబోధ దేశదాస్యమ్ము డులిపితి
తొల్లి యెవని కెవుడు సెల్లె గాంధి.

౫౪

ఊటుక తెడ్డునాకి యుపవాస దీక్షను
జెఱుచుకొనెడు దేశసేవకులకుఁ
గటదలెల్ల బోధగటిపి స్వాతంత్ర్యమ్ము
దెచ్చితీవు పరులు మెచ్చ గాంధి.

౫౫

కడుపులోని చల్లగదలక రవియస్త
మింపనట్టి రాజ్యమేలు దొరలఁ
గత్తి కట్టి లేక తత్తర మ్మొత్తించి
పంచి తాత్మశక్తి వలన గాంధి.

౫౬

ఊఁగులాడుపల్లు లాగిన సుఖమబ్బు
నెక్కువైన తిండి గ్రక్కు బాగు
చీడపుర్వువంటి చెడుగని వెలివేయ
సంఘమునకు మేలుజరుగు గాంధి.

౫౪

బూఁజువట్టినట్టి పూర్వధర్మమ్ములఁ
జెక్కఁజెదరనీక చెవులు నవియ
నినుచువారలెల్ల నీపేరు సాకుగాఁ
దీసికొని రిదేమి తెగులు గాంధి.

౫౫

పనికిమాలినట్టి వర్ణాశ్రమాచార
ములను నిల్ప నేఁడు మోసగాండ్రు
రామ రామ యనుచు అంపిల్లు చున్నారు
సంచుగొందు లందిపొంది గాంధి.

౫౬

మోసమెపుడు దలఁచుఁ జేసిన మేలెల్ల
మఱిచు విశ్వసింపఁ జెఱుచు ఖలుఁడు
పాలువోసి పెంపఁ బాము కాటందదా
సహజగుణము లెట్లు సమయు గాంధి.

౫౭

గొడవలెల్లఁ దీఱఁ గొఱకొఱ లణఁగారు
చెడని సిరులు గలుగఁ జెలువ మబ్బ
నేఁడు నిన్నుఁ దలఁప నిల్చును గద్దెపైఁ
దొసఁగు లెన్నియున్నఁ దొలఁగి గాంధి.

౬౧

మాటమంతి నేర్పి మన్నించు వారల
నాదరింపకున్న హానిగల్గుఁ
దిన్నయింటివాస మెన్ను దుర్బుద్ధుల
వారు పరుల బ్రదుకనీరు గాంధి.

౬౨

గడ్డివేయ నావు కడవెఁడు పాలిచ్చుఁ
బాలువోసి పెంపఁ బాము గఱచు
మంచివాఁడు మేలు మఱచిపోఁ డెన్నఁడు
కూళ గూల్చుఁ బరులకొంప గాంధి.

౬౩

కీడు మూఁడువేళ వాఁడిమి పోఁడిమి
యుక్కుమిగులుచుండు నుత్తమునకుఁ
బుటము వెట్టివెట్టి పటికార్పఁ బసిఁడికి
వన్నె హెచ్చు గుణము వచ్చు గాంధి.

౬౪

నయము భయము దెల్పి నట్టింట నిల్పిన
మోసగాఁడు నిలువఁబోవఁ డచటఁ
బసిఁడిపూఁతరాగి పస యెంతవఱకుండుఁ
గడవఁగడవఁ బైటఁబడక గాంధి.

౬౫

కాలమెల్లఁ దీటి కాటికిఁ గాళ్లారఁ
జాఁపునాఁడు గద్ది నాఁపుకొంద్రు
జవము జీవమున్న యువకుల ధీశక్తి
మొక్కవోయె దేశమునను గాంధి.

౬౬

పొలముదున్ని జబ్బపుష్టిని గోల్పోయి
బక్కచిక్కి రైతు బ్రతుకుచుండె
గొంతువఱకు మెక్కి గంతులు వైచుచుఁ
దిండిదొంగ తిరుగుచుండె గాంధి.

౬౭

దేశసేవపేరఁ దిరిగెడి యయ్యలు
తియ్యతియ్యమాట లొయ్యఁ బలికి
గొడ్డుబిడ్డఁ గూర్చుకొని కుల్కుచున్నారు
పరులనార్చి మేలువడసి గాంధి.

౬౮

బ్రదుకునంతవఱకుఁ బ్రాలుమాలిక లేక
కష్టపడెడు వాని కిష్ట మొదవు
పరుల నొక్కకాసపడి పడిపంచల
నొందువాఁడు సిలుగులొందు గాంధి.

౬౯

వెంటనంటి పొగడు తుంటరి మూఁకల
పొగడితలకు లొంగిపోయి తుదకుఁ
దమకుఁగాని పనులఁ దలపెట్టి జనులకు
దూరమైరి నేటిదొరలు గాంధి.

౭౦

ముఖకటించుకొనుచు మొగమెత్తి చూడరు
బలిమిదక్కి సన్నగిలిన వానిఁ
గలిమి బలిమి రెండు గల్గిన పెఱవాని
నాదరింత్రు బంధువట్లు గాంధి.

౭౧

కీడుసేయువారికిని మేలుసేయుట
తప్పులెన్నువారి నొప్పకుంట
ప్రాణగొడ్డమైన పనులను వీడుట
నీమతమ్ము ధర్మనిరతి గాంధి.

౭౨

పొరుగువాని మోసపుచ్చి జీవించుట
సొంతలాభమునకుఁ జింతపడుట
యైనకానిదాని కల్లరిసేయుట
మానవత్వమునకు మచ్చ గాంధి.

23

తనుపొకింతలేని ధనమును గూర్చుట
పరుల హీనులంచుఁ బలుకుచుంట
కానిపోని పనులఁ బూని తారాడుట
తగదు సుంత నీమతాన గాంధి.

24

కులము మతమటంచు గొణఁగుట పదవులఁ
జుట్టములకుఁ గొల్లకొట్టి యిడుట
మాటమనసు రెండుబాటలు వట్టుట
నీమతానఁ గానఁబోము గాంధి.

25

ద్రవ్యమునకు ఫలము దానమ్మ్మా సేయుట
నయము దెలియు ఫలను నడచుకొనుట
చదువుకొన్న ఫలము పదుగుర కించుట
వీనులున్న ఫలము వినుట గాంధి.

26

శక్తిగల్గి పరుల సాధింప కుండుట
తెలిసి తెలిసి కష్టములను బడుట
అవసరమ్మ్మగలుగ నాత్మ నర్పించుట
నీ చరిత్ర నివియె నిల్చు గాంధి.

౭౭

నీవు గఱపినట్టి నీతికి వెలియైన
జనములెల్ల జిత్తశాంతికొఱకు
బోసినోటి నిన్ను బొమ్మగా వెలయించి
కొల్తు రనుదినమ్మ్మి గూడి గాంధి.

౭౮

దిటముదక్కి నీకు దేవాలయమ్మ్మిలు
దేశభక్తగణము దీర్చె నేఁడు
ముదిమిడయ్యి మిమ్మ్మి ముందెట్టి ముప్పుల
నిడఁగలారొ యెఱుకపడము గాంధి.

౭౯

వినుతినేసి సర్వగుణములు నీయంద
నిలిపి వాని కర్హతలను దెలిపి
తనకు శక్తిచాలదని పాపముం జేయ
జంకఁడేని నీదులెంక గాంధి.

౮౦

హూణపాలనమున నున్నతోద్యోగమ్మ్మి
లెల్లఁజేసి జనులఁ గొల్లకొట్టి
వాఁడె నేఁడు దేశభక్తుఁడై పెద్దయై
మంచిగద్దె లాక్రమించె గాంధి.

౮౧

సభలలోన బీదసాదుల పక్షమ్మున
మాటలందు మంచి మార్దవమ్మున
గలుగువారె గడనఁ గావించువేళలఁ
బాపమునకు నేవపడరు గాంధి.

౮౨

స్త్రీలు పురుషులెల్లఁ జేరి యొక్కమ్మడి
రామయనుచు నోరు వ్రయ్యఁబలికి
కులము దెల్పి ముందు కొబ్బరిముక్కల
నందఁ గోరుచుండు రంద గాంధి.

౮౩

బ్రదికినంతకాల మదరించి బెదరించి
మంచిచెడ్డ కడ్డగించి వంచి
చచ్చిపోవ మ్రొక్కసాగిరి నాయకు
లడ్డమింకఁ దొలఁగె నంచు గాంధి.

౮౪

జనుల కనులఁగప్పి తనవారి నెల్లర
నాదరించి పదవు లంటఁగట్టి
సాటివానిఁ ద్రొక్కి సాగించు పెత్తన
మ్మేటిగట్టు చెట్టుపాటి గాంధి.

౮౫

కూఁత వ్రాఁత చేఁత గుదిరిన మనుజుండు
కోటి కొక్కరుండు గూడ లేఁడు
బ్రదుకుఁదెరువు దేశభక్తులు చెలరేఁగి
నడపుచుండి రేలుబడిని గాంధి.

౮౬

ఆసఁ గోసినట్లు మీసాల గడ్డాలఁ
బెంచి జనుల దుంప తెంచినారు
వీరిమాఁటె నేఁడు వేదార్థమై సాగు
వేసమునకు నెంతవిలువ గాంధి.

౮౭

వండనట్టికూడు వడకనిగుడ్డను
గోరువారు మేరమీఱునాఁడు
పరులుగూర్చు పాఁడిపంటలు భక్షింపఁ
గూఁత లిడుట కేమిబ్రాఁతి గాంధి.

౮౮

గాలిధూళియనక కష్టించి కష్టించి
పైకలాడునాఁడె డొక్కలాడు
బక్కచైతు నిలువఁద్రొక్కును మార్గమ్ము
దలఁపరైరి నాయకులును గాంధి.

౮౯

కూలినాలివాని గోడాలకింపక
దేశమునకుఁ బుట్టిఁ దెత్తు మనుచు
నోరునొవ్వఁ దిరిగి యూరూర బోధింప
లేనివాని కేమిలెస్స గాంధి.

౯౦

ఉండ నిల్లులేక పండ మంచములేక
తినఁగఁ దిండిలేక యణఁగువారు
పలువురుండ నిదియె స్వాతంత్ర్య మందురు
పరులకనులఁ గప్పువారు గాంధి.

౯౧

ఆలుచావఁ బెనిమి టాలుగోలై పోవుఁ
దల్లిచావ బిడ్డ తల్లడిల్లుఁ
బుణ్యపురుషు మృతికి భూనభోంతరములు
డిల్లపోయి దద్దఱిల్లు గాంధి.

౯౨

ప్రజలనెల్లఁగూర్చ రాము రహీముల
నొక్కచోటఁ గొల్చుచుందు వీవు
కేఁచులాట లుడుపఁ గ్రీస్తువుం గొల్తువు
పరులకొఱకె దైవభజన గాంధి.

౯౩

జినునిమతము చిత్తమున నిల్పి యద్వైత
మాదరించి బౌద్ధమందు నిలిచి
రామరామయంచు రామానుజు న్మెచ్చి
నిల్చినాఁడ వెంతనేర్పు గాంధి.

౯౪

కష్టములకు నోర్చి కస్తూరిబాగాంధి
దేశసేవఁ బాలు దీసికొనియె
జాతికెల్ల నీవు జనకుండవై యుండ
జాతికెల్ల నామె జనని గాంధి.

౯౫

సివము చిందువేయు నవఖాళిలో నీకుఁ
దొలఁగి మ్రొక్కి పచ్చితురక గూడ
వంగి దండమనుచు వధియించె నున్మాది
గీత నెఱిఁగియుంటచేత గాంధి.

౯౬

నాఁడు దండమనుచు గోడిసె భౌతిక
దేహమునకె చెఱుపుఁ దెచ్చినాఁడు
నేఁడు నిన్నుఁగొల్చు నీవారె సిద్ధాంత
మాఱుపంగ మూఁగినారు గాంధి.

౯౭

మాంసభక్షణమ్మ్మె మద్యపానము లేక
తిరిగినాఁడ వితరదేశములను
బలికి బొంక కేక పత్నీవ్రతమ్మ్మెను
బట్టితీవు బ్రతుకువఱకు గాంధి.

౯౮

ఏమహత్తు గలదొ నీమంత్రబలమున
నెండ వాన లెఱుఁగ కుండువారు
మేము మేమటంచుఁ దామంత బందికై
పరుగు లిడిరి సేగి వలచి గాంధి.

౯౯

కుమిలి కుమిలి యింటిగోడల మధ్యనే
పరితపించు నాఁడువారి నెల్ల
వెలికిఁదీసి దేశవిప్లవ మ్మెసఁగేఁప
నిలిపితీవు పట్టుదలను గాంధి.

౧౦౦

పరులకుఁ జెప్పెడు నీతులు
పరికింపఁగఁ జేయ సాధ్యపడునో లేదో
గుఱు తెఱిఁగి మెలఁగు పద్ధతి
దరిసింపఁగఁ గోరి నిన్నుఁ దలఁచెద గాంధీ.



ఇతరకృతులు

౧.	నెహ్రూ చరిత్ర (ప్రథమ భాగము)	3-0-0
౨.	దివ్యస్మృతులు	1-8-0
3.	భావలింగశతకము (పరిష్కృతము)	0-6-0
౪.	శబ్దలక్షణ సంగ్రహము (చిన్నయసూరి)	0-8-0
౫.	కర్షకా	0-4-0

ప్రతులకు :—

కొండవీటి వేంకటకవి,
పొన్నూరు.
(గుంటూరు జిల్లా.)